# నమ్మకాలు

ఒక మర్రిచెట్టుకింద వ్యాన్ ఆపుకొని అల్పాహారాన్ని తింటూ కూర్చున్న పిల్లల మధ్య టీచర్ కూర్చున్నాడు.

" సార్ సార్ " అంటూ పరుగెత్తుకొచ్చాడు జాన్సన్

" ఏమి అన్నట్టు చూశాడు టీచర్."

" ఆ రసూల్ గాడు చూడండి సార్" అంటూ తాను వచ్చిన వైపు చూపుడు వేలుతో చూపాడు.

" ఏం జరిగింది" అంటూ చేతిలోని పులిహోరావున్న ఆకును పక్కకు పెట్టి జాన్సన్‌ను అనుసరించాడు.

" సార్ ఒకదాన్ని రాళ్లతో కొట్టి చంపేశాడు. యింకోదాన్ని వెంట పడ్డాడు సార్" పోతూ పోతూ ఎగపోస్తు చెపుతున్నాడు.

" దేన్నిరా"

" మీరే చూడండి సార్"

టీచర్ జాన్సన్ వెంట నడిచి గుంపుగ వున్న మొదుగ పొదల్లో తిరగాడుతున్న తొండల్ని రాళ్లతో కొడుతున్నాడు. దాన్ని గమనించిన టీచర్.

" ఏమ్ రసూల్ ఏమిటిరా ఆ పని?"

" వీటిని చంపాలి సార్"

" ఎందుకు"

జవాబు లేదు.

" ఒరే జీవ హింస చేయకూడదని చదవలేదా?"

" అమ్మో వీటిని చంపాలి సార్!" అంటూ రాళ్లు విసురుతునేవున్నాడు.

" ఎవరు చెప్పారు" అంటు వెళ్లి అతని చేయి పట్టుకొని ఆపాడు.

" వదలండి సార్ అంటూ టీచర్ ముఖంలోకి చూస్తు నిలుచున్నాడు.

టీచర్ అతని ముఖంలోకి చూస్తున్నాడు. రసూల్ ముఖంలో కసి టీచర్ ముఖంలో పలుచటి చిరునవ్వు.

" ఏ ప్రాణిని చంపకూడదు" అంటూ చచ్చిపడివున్న తొండవైపు జాలిగ చూస్తూ, అతని చేతిని అలాగే పట్టుకొని మర్రిచెట్టు వైపు తీసుకొచ్చాడు. ఈ లోపు జరిగిందేమిటో చూద్దాం అని మరికొందరు విద్యార్థులు ఎదురొచ్చారు. అందరూ కల్సి మర్రిచెట్టు కిందకు నడిచారు.

" రసూల్ తొండను నీవు అనవసరంగా చంపావు. అది ఎవరికి హాని చేసేది కాదు విషం కక్కేజీవి కాదు. వాటి వెంట ఎందుకు పడ్డావు".

" మాతాత చెప్పాడు గిర్‌గుట్ కనిపిస్తే పత్తర్‌సేమార్నా అని " తనకు వారసత్వంలో వచ్చిన అపురూప రహస్యాన్ని దాచి దాచి చెప్పినట్టు చెప్పాడు.

" నో.నో అది సాధుజీవి" అంటూ మర్రికొమ్మలవైపు చూశాడు. పైన కొమ్మలను కరచుకొని వున్న తొండలు కనిపించాయి.

" ఎప్పటినుండో తొండ కనిపించగనే క్రూరంగా రాళ్లతో కొట్టి కొట్టి చంపడం జరుగుతూవుందట. ఆ క్రమంలోనే రసూల్ చూడగానే తొండలను రాళ్లతో కొడుతున్నాడు. దీనికి అంతం ఎపుడో? ఈ విషయాన్ని గూర్చి అందరం కల్సి ఆలోచించాలి. అంతేకాదు అందరం కలిసి ఆపాలి" అంటూ రసూల్‌వైపు చూశాడు. రసూల్ మనస్సులో ఏదోకొత్త ఆలోచన కదుల్తూవుంది. అవును అమాయకపు జీవి, హాని ఎరుగని ప్రాణిని ఎందుకు కొట్టి చంపుతున్నట్టు? తాత తనకు ఎందుకు చెప్పినట్టు?

" ఏమిటాలోచిస్తున్నావ్" టీచర్ అడిగాడు.

" ఏం లేదుసార్, మాతాత ఎందుకలా చెప్పాడా అని"

" వాళ్ల కాలంలో ఏం జరిగిందో, ఎవరు వాళ్లకు అలా చెయ్యమని ఎందుకు చెప్పారో మనకు తెలియదు, అది వాళ్లకే వొదిలేస్తే సరి"

రసూల్ సరే అన్నట్టు తలాడించాడు.

" అయితే మనం ఆలోచించవల్సింది ఆచరించవల్సింది, మన కాల ధర్మం మన కాలంలో మన ధర్మాన్ని చెబుతుంది? జీవహింసచేయరాదు.

" అంటూ పిల్లలందరివైపు చూశాడు. పిల్లలందరు అవునన్నట్టు ఆమోదంతో తలలూపారు. రసూల్ ముఖంలోను ఓ కొత్త ఆలోచన కదిలింది.

" అందరు ఒక్క దగ్గర్కి రండి ఎండతగ్గగానే యింకొంచెం సేపట్లో బయలుదేరుదాం, అంతకంటె ముందు కాసేపు మాట్లాడుకుందాం" అంటూ అందర్ని రమ్మంటు చేతితో సైగ చేశారు. అందరూ టీచర్ చుట్టూ చేరారు. వాళ్లంతా పదిహేనేళ్లలోపువారే, పువ్వుల్లాంటి ముఖాలు, పెరిగే వయస్సు, కరిగె మనస్సులు.

" చూడండి మనకు బుద్ధుడు ఏంచెప్పాడు, జీవహింస చేయరాదు, అంటే ఏ ప్రాణిని చంపరాదు"

" ఆలోచించి అత్యవసరమైతే, ప్రాణానికి హాని జరిగేటట్టువుంటె చెయ్యొచ్చునేమో కాని అవసరంలేంది చీమలను కూడ" అనే లోపే

" చంపొద్దు కాని మరి దోమల్ని చంపుతున్నాం కదాసార్" మరో విద్యార్థి

టీచర్ నవ్వుతూ " దోమలు మనలను బాధిస్తాయి, మన రక్తాన్ని తాగుతాయి, అంటురోగాలు కలిగిస్తాయి. కాబట్టి చంపుతున్నాం ఏ సూత్రానికైనా పట్టు విడుపు వుంటుంది"

"సార్ యిప్పుడు ఈ అడవిలో ఓ పులి మనమీద పడితే" --

" మొదట దానిని పారదోలాలి"

" ఆ అది వూరుకుంటదా, పైన పడి పంజాతో కొట్టదూ"

" అప్పుడు దాన్ని చంపొచ్చు అది క్రూర మృగం."

" అంతేకాని మన జోలికిరాని తొండల్ని, అందమైన తూనీగలను చంపుతారు, మీరు క్రింది తరగతుల్లో వున్నపుడు ఎన్ని తూనీగలను చంపారో గుర్తు తెచ్చుకోండి, మూఢనమ్మకాలతో మూర్ఖపుఆనందంతో మరొక ప్రాణికి హాని చేయొద్దుసుమా" అన్నాడు టీచర్. అప్పుడాయన చెట్టుకింద మరో బుద్ధుడా! అనిపించింది అందరికీ.

ఆ తరువాత అందరూ అటు యిటూ తిరుగుతూ చెట్టుఎక్కి కాసేపు కోతికొమ్మచ్చి ఆట ఆడుకున్నారు. క్లీనర్ మఱ్ఱిచెట్టెక్కి తేనెను జోపుకొచ్చి మఱ్ఱాకు డొల్లలో పోసిచ్చాడు. వెంకట్ వేరే డొల్లల్లో కాస్త ఎక్కువ తేనెను తెచ్చి టీచర్ కిచ్చాడు. డ్రైవర్ తెట్టెను తుంచి తలాకాస్త యిస్తూ, మధ్య మధ్య వున్న జిడ్డు తెట్టెను ఒకచోట పెడుతువున్నాడు.

నలుగురైదుగురు పక్క చెలుకలో వేపచెట్టుకున్న తేనెను జోపడానికి ప్రయత్నం చేస్తూ వున్నారు. అందులో రామిరెడ్డి చెట్టు ఎక్కి తెట్టెను కదిపాడు. అంతే తేనెటీగలు అతన్ని కుట్టసాగాయి. బాధతో భయంతో చెట్టు దిగి తంగెడుకొమ్మలను యిరుచుకొని వాటి బారినుండి తప్పించుకునే ప్రయత్నం చేసాడు. కాని అవి రెడ్డిని అంతసులభంగా వొదలలేదు. రెడ్డి వెంటవున్న మూర్తిని గూడ కొన్ని ఈగలు కరిచాయి. అది చూసిన డ్రైవర్ ముసిముసిగ నవ్వాడు. మళ్లీ వ్యాన్ కదిలింది. అడవిలో దొరికే ఫలాల గూర్చి తేనె పట్టుల గూర్చి వాటి రుచుల గూర్చి చర్చించుకుంటున్నారు.